# 12

## మతశాఖ కాని క్రైస్తవ్యం:

# బాప్తిస్మం పొందింది దేనిలోనికి?

"Into" అనే పదం ఆంగ్ల భాష మాట్లాడే ప్రజలకు ఎంత బాగా తెలుసునంటే, దాని భావాన్ని స్పష్టపరచడానికి చేసే ప్రయాస అనవసరమనిపిస్తుంది. అయినా, దాని ఖచ్చితమైన స్థిరమైన భావానికి ప్రత్యేకించి మీ దృష్టిని మరల్చాలని నేను కోరుతున్నా. విసిగించుతున్నట్టు భావించకండి సత్యాన్ని గూర్చి స్పష్టమైన అభిప్రాయం కలిగించేలా అది ఒక ఆత్మకైనా సహాయపడవచ్చు. అలాటప్పుడు, ఆ ఒక్కరి కొరకు యితరులను విసిగించినా ఫరవాలేదు.

ఈ పదం యొక్క ప్రయోగాన్ని ఉదహరించుదాం. తన బిడ్డ బావిలో ("into") పడిపోయిందని ఒక తల్లికి ఒకరు చెప్పినట్టయితే, ఆ బిడ్డ ఎక్కడుందో ఆ తల్లికి ఖచ్చితంగా తెలుసు. ఆమె వెంటనే పరుగిడుతుంది. ఆ బావి వద్దకు చేరేవరకు ఆమె ఎక్కడా ఆగదు. ఆ బిడ్డను బావిలోనుండి "వెలుపలికి" తీసేవరకు ప్రతి ప్రయత్నం జరుగుతుంది. అలాగే, నమ్మదగిన మాటను బట్టి, దొంగ యింటి"లోనికి" ("into") వెళ్లినట్టు ప్రకటింపబడితే, పోలీసు అధికారి యింటి "వెలుపల" వానిని వెదకడు. చేనిలోనికి పశువులు వెళ్లాయని కుమారుడు తండ్రికి చెప్పినట్టయితే, ఆ పశువులు ఎక్కడ ఉండాలో అక్కడ కాకుండ, చేని"లోనికి" ప్రవేశించినట్టు తండ్రి అర్థం చేసికొంటాడు.

మనమందరం "into" అనే పదానికి అంతటి స్థిరమైన ఖచ్చితమైన అర్థాన్ని ఎల్లప్పుడు "చూస్తాం" లేక ఒకే విధంగా గ్రహించుతాం. దాని ప్రతి ప్రయోగంలోను, ఒక దానిలోనుండి మరొక దానిలోనికి దాటుతున్నట్టు, మనం ఊహించుతాం. పశువులు చేని"లోనికి" వెళ్లాయంటే, దానిలోనుండి "వెలుపలికి," ముందుగా ఎక్కడ ఉన్నాయో అక్కడికి, అవి తోలివేయబడతాయి. అది పరిపూర్ణమైన అవసరత, ప్రతి వ్యక్తి దాన్ని అలాగే "చూస్తాడు," దాని ప్రయోగంతో ఏకీభవిస్తాడు. ఆలాటి వాక్యాలలో లేక ప్రతిపాదనలలో "into" అనే పదం యొక్క భావంమీద చదివే ప్రతివాడు చదివే మరొకనితో పరిపూర్ణంగా అంగీకరిస్తాడు. దాని భావాన్ని అపార్థం చేసికొనడం అసాధ్యమౌతుంది. "into" మాటను ఉపయోగించి ఒకరు ఒక వాక్యాన్ని రూపించగోరుతున్నాను. అలా రూపించిన తరువాత, "into" అనే పదం యొక్క భావాన్ని చెప్పడంలో యిద్దరు యథార్థ హృదయులను అపార్థంలోనికి నడిపిస్తుందేమో గమనించు.

ఒక స్థలంలో పశువు యింతకు ముందే ఉన్నట్టయితే, ఆ స్థలం"లోనికి" అది ప్రవేశింపగలదా? బిడ్డ బావి"లో" పడియుండగా, బావిలో పడగలదా? ముందుగా వెలుపల ఉండకుండ, "లోనికి" దాటడం, "లోనికి" పడడం, "లోనికి" దుమకడం లేక మరి

యింకా ఏ విధంగానైనా ప్రవేశించడం జరుగుతుందా? ముందే పెండ్లి చేసికొని, ఒక యువతి తిరిగి అదే వివాహ బంధంలో ప్రవేశింపగలదా? వివాహం కాకముందు ఆమె ఆ బంధానికి వెలుపల ఉంది. కాని పెండ్లి చేసికొనడంతో, ఆమె ఆ బంధం"లోనికి" ప్రవేశిస్తుంది తరువాత ఆ బంధం"లోనే" నిలిచియుంటుంది.

"Into" అనే పదాన్ని యింత స్పష్టంగా నిర్వచించడంతో, యిప్పుడు పరిశుద్ధాత్మనుండి వచ్చిన కొన్ని లేఖన భాగాలను పరిశీలించుడని యథార్థ హృదయులను నేను అడుగు తున్నాను:

> కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు (మత్తయి 28:19).

> వారు ఆ మాటలు విని ప్రభువైన యేసు నామమున (నామములోనికి) బాప్తిస్మము పొందిరి (అపొ. 19:5).

> క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? (రోమా 6:3).

> మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి (1 కొరింథీ. 12:13ఎ).

> క్రీస్తులోనికి బాప్తిస్మముపొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు (గలతీ. 3:27).

గనుక, క్రొత్త నిబంధన బయలుపరచబడుతున్న దినాల్లో, దేవుని పరిశుద్ధులగు మనుష్యులు, పైనుండి వచ్చిన శక్తిచేత కదిలింపబడినవారై లేక ప్రేరేపింపబడినవారై – జనులకు "తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామము'లోనికి' " (*eis*) "into" బాప్తిస్మమిచ్చారు. ప్రభువైన యేసు నామంలోనికి (*eis*) "into" బాప్తిస్మమిచ్చారు. వారు వారికి క్రీస్తులోనికి (*eis*) "into" బాప్తిస్మమిచ్చారు. వారు వారికి క్రీస్తు మరణంలోనికి (*eis*) "into" బాప్తిస్మమిచ్చారు. వారు వారికి ఒక్క శరీరంలోనికి బాప్తిస్మమిచ్చారు (*eis*) "into." వారు వారికి క్రీస్తులోనికి (*eis*) "into" బాప్తిస్మమిచ్చారు; అలా బాప్తిస్మం పొందినవారు క్రీస్తును ధరించుకున్నారు. చివరిగా, అపొస్తలులు ప్రజలకు పాపక్షమాపణ నిమిత్తం (unto) లేక "into" (*eis*) బాప్తిస్మమిచ్చారు.

ఈ లేఖన భాగాలలో ఉన్న "into" అనే పదానికి ద్వంద్వార్థం లేని భావాన్ని మనం దానికి యిచ్చినట్టయితే, అపార్థానికి తావే ఉండదు. క్రొత్త నిబంధన (బయలుపరచ బడుతున్న) దినాల్లో బాప్తిస్మానికి ముందు ప్రజలు, తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామానికి "వెలుపట"నున్నారు; క్రీస్తు మరణానికి "వెలుపట" ఉన్నారు; ఒక్క శరీరానికి "వెలుపట" ఉన్నారు, క్రీస్తుకు "వెలుపట"నున్నారు, మరియు పాపక్షమాపణకు "దూరంగా ఉన్నారు." బాప్తిస్మంవలన, పరిశుద్ధమైనదియు, దేవునిచే సృజింపబడిన బాంధవ్యాల్లోను దీవెనలలోను వారు ప్రవేశించారు.

గనుక, పరిశుద్ధమైన నామాల్లోనికి ప్రవేశించడంవలన, క్రీస్తు మరణంలోనికి ప్రవేశించడంవలన, క్రీస్తు యొక్క పరిశుద్ధమైన శరీరంలో ప్రవేశించడంవలన, క్రీస్తులోనికే ప్రవేశించడంవలన, పాపక్షమాపణలోనికి ప్రవేశించడంవలన పొందే దీవెనలు ఏవైనా ఉంటే, అవన్నీ లేఖనానుసారమైన బాప్తిస్మం పొందడంవలన లభిస్తాయి. ఇది అలాగే అయ్యుండాలి. లేకపోయినట్టయితే, ఆలోచనా భావాన్ని వ్యక్తపరచడానికి భాష సరియైన సాధనం కాదన్న మాట. మాటల శక్తివలన మనకు తెలియజేయబడిన దేనిమీదను మనం ఆధారపడకూడదన్న మాట.

విలపించుతూ, దుఃఖించుతున్న సౌలుతో అననీయ "... లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి, బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుము" అని చెప్పడంలో వింతలేదు (అపో. 22:16). "ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిది మంది నీటి ద్వారా రక్షణ పొందిరి. దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" అని పేతురు అంటే ఆశ్చర్యపడనవసరం లేదు (1 పేతురు 3:20, 21ఎ).

వాస్తవానికి, పరిశుద్ధులైన మనుష్యులు (అపొస్తలులు) దీనికి భిన్నంగా ఎలా బోధించి ఉంటారు? ప్రభువైన యేసు తన కడపటి ఆదేశాలను జారీ చేస్తూ యిలా అన్నాడు: "మీరు సర్వలోకమునకు వెళ్లి, సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15, 16). సరిగా సిద్ధపరచబడిన హృదయం, లేఖనానుసారమైన బాప్తిస్మమనే కార్యాన్ని ముగించినపుడు రక్షింపబడుతుందని ప్రభువైన యేసూ, దైవ ప్రేరేపితులగు ఆయన అపొస్తలులూ బోధించినట్టయితే, నిశ్చయంగా అది మానవ ఉపన్యాసంవలన జరిగిన పని కాదు.

మరోసారి నేను యథార్థ హృదయులకు విన్నవించుకొంటున్నా. రక్షణతో లేక పాపక్షమాపణతో బాప్తిస్మానికున్న సంబంధాన్ని గూర్చి పరిశుద్ధాత్మ యింత సరళంగాను తేటగాను తెలిపినప్పుడు, త్రోవలో "వక్ర మార్గాన్ని" కల్పించి పార్టీలుగా మనం ఎలా విభజించగలం? మనమందరం ఏక భావంతో మాట్లాడాలని, మనలో విభజనలు లేక యేక మనస్సుతోను ఏక తాత్పర్యంతోను, మనం సన్నద్ధులమై ఉండాలని మన ప్రియ ప్రభువు కోరుతున్నాడు. యథార్థమైన, నమ్మకమైన హృదయాలు ద్వంద్వార్థంకాని పరిశుద్ధాత్మ యొక్క ఉపదేశం విషయంలో విభజింపబడినవారై ప్రభువునకు ఎలా నమ్మకమైనవారుగా కొనసాగ గలరో – అది నా జ్ఞానానికి మించినదైయుంది. విభజనలలో కొనసాగుతూ, ప్రభువుకు నమ్మకస్థులమని చెప్పుకొనడానికి ఎలా కుదురుతుందో నేను చూడలేను. ఉద్దేశ పూర్వకంగా విభజనలను ప్రోత్సహించుతూ, ద్వంద్వార్థం లేని ప్రభువు యొక్క బోధకు వ్యతిరేకంగా అవి కొనసాగింపబడుతున్నప్పుడు, నిశ్చయంగా వాకిట దుష్టత్వము, పాపము పొంచియున్నాయి.

"పార్టీలను," "సిద్ధాంతాలను," మతశాఖల విధానాన్ని విడిచిపెట్టి, పేతురు, యాకోబు, యోహానులు కేవలం ఎలా క్రైస్తవులైయుండిరో – అలాగే క్రైస్తవులుగా మాత్రమే ఉండడంతో సంతృప్తి పొందేవారందరికి నేను మరోసారి విన్నవించుకొంటున్నాను. యెరూషలేము సంఘంలో ఉన్న వారందరు – ఎలాటి క్రైస్తవులైయుండిరో, క్రొత్త నిబంధన (బయలుపరచ

బడుతున్న) దినములలో క్రైస్తవులందరు కేవలం ఎలా క్రైస్తవులైయుండిరో, మనం కూడా అలాటి క్రైస్తవులమై ఉందాం. చనిపోకముందు చేయబడిన రక్షకుని యొక్క ప్రార్థన తిరిగి నిజ రూపాన్ని దాల్చును గాక! పరిశుద్ధాత్మవలన కోరబడిన దేనినైనా వదలుకొనడానికి మనలో ఇష్టపడేవారందరు క్రీస్తు కొరకు ఒక్కటై ఉందామా? ఈలాటి ఏకత్వపు ప్రదర్శన మన ప్రభువును ఆనందింపజేస్తుంది. తద్వారా, దేవుడు ఆయనను పంపెనని నశించిన లోకం నమ్ముతుంది. క్రీస్తునందలి ఏకత్వానికి నిజమైన యథార్థ హృదయాలను కదిలించేది ఏదీలేదా?